క్లుప్తంగా

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



చెక్కులను పంపిణీ చేస్తున్న శాప్ చైర్మన్

నందికొట్కూరు రూరల్ : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామానికి చెందిన గొల్ల చిన్న ఎల్లప్ప, పట్టణానికి చెందిన షేక్ షకీల్‌లకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల చెక్కులను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న పేద ప్రజలకు అండగా ఉండేందుకే అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, బొల్లవరం ఉప సర్పంచ్ సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో పొలంబడి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులు పొలంబడి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్షావలి సూచించారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో అధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు శనగ పంటలో వచ్చే తెగుళ్ల నివారణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, రైతులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ వికెట్లు సాధించిన వేంపెంట క్రీడాకారుడు



హ్యాట్రిక్ వికెట్లు తీసిన జగదీష్‌ను షీల్డుతో సత్కరిస్తున్న ఫిజికల్‌డైరెక్టర్ నాగరాజు

పాములపాడు: ఆడుదాం ఆంధ్రా టోర్నమెంటులో క్రీడాకారులు అసమాన ప్రతిభను కనబరుస్తున్నారు. నందికొట్కూరు పట్టణంలో జరిగిన నియోజకవర్గం స్థాయి క్రికెట్ పోటీలో మండలంలోని వేంపెంట జట్టు మిడుతూరు జట్టుతో పోటీపడింది. కాగా వేంపెంట గ్రామానికి చెందిన క్రీడాకారుడు జగదీష్ హ్యాట్రిక్ వికెట్లు తీసి ఔరా అనిపించాడు. అందరి ప్రశంసలు పొందాడు. నిర్వాహకులు షీల్డుతో సత్కరించారు. తోటి క్రీడాకారులు. వేంపెంట జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు.

పేదల కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు షైనీ ప్రియాంక

నందికొట్కూరు: పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలులోకి తెచ్చారని వైద్యులు షైనీ ప్రియాంక, శ్వేత అన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్‌ఎన్ ఫంక్షన్ హాల్‌లో 3వ సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వారు 570 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పు



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

మహానంది: విద్యా వ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొని వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల మనసులో నిలిచిపోతారని తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఎనిమిదవ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబులు పంపిణీ చేశారు.

వేలంపాట వాయిదా

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతిదేవి ఆలయంలో అంగళ్ల నిర్వహణకు బుధవారం జరగాల్సిన వేలంపాట వాయిదా వేసినట్లు ఈఓ మోహన్ తెలిపారు. ఈనెల 12న వేలం నిర్వహించగా హోటల్, బెల్లం చెరుకులు, కలింగర పండ్లు, అమ్మవారి ఫొటోలు విక్రయించుకునేందుకు వేలం వేయగా ఎవ్వరు ముందుకు రాకపోవడంతో బుధవారానికి వాయిదా వేశామన్నారు. ఈ సారి కూడా పాటాదారులు ముందుకు రాకపోవడంతో మరొకసారి వాయిదా వేయాల్సి వచ్చినట్లు చెప్పారు. తదుపరి బహిరంగ వేలం తేదీన త్వరలోనే ప్రకటిస్తామని వివరించారు.

క్రీడలకు పెద్ద పీట

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- అట్టహాసంగా నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్రా పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగించిన రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి

నందికొట్కూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడలకు పెద్ద పీట వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారని రాష్ట్ర శాప్ చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని గవర్నమెంట్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్ర పోటీలను క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, జాతీయ స్థాయి క్రీడాకారులు క్రీడా జ్యోతితో ర్యాలీ నిర్వహించారు. క్రీడా జెండాను, ఆడుదాం..ఆంధ్ర జెండాను ఎగురవేశారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను సిద్ధార్థ రెడ్డి పరిచయం చేసుకున్నారు. చిన్నారుల యోగాసనాలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు సీఎం వైఎస్ జగనన్న ఉద్యోగాలిచ్చారని గుర్తు చేశారు. యువత క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో నియోజకవర్గానికి, ఊరికి, తల్లిదండ్రులకు తగిన గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నాగరాజు, నియోజకవర్గ స్థాయి క్రీడల బ్రాండ్ అంబసిడర్, అండర్ జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పృథ్వీ, ఎంపీపీలు మురళీకృష్ణారెడ్డి, సువర్ణ, మల్లేశ్వరి, జెడ్పీటీసీలు కరిమున్నీసాబేగం, పుల్యాల దివ్య, యుగంధర్‌రెడ్డి సోమల సుధాకర్‌రెడ్డి, శాప్ జిల్లా కోఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్, నియోజకవర్గ కోఆర్డినేటర్ డోరతి తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



బాలికల హైస్కూల్‌లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు

విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం అమలు చేస్తుంటే చంద్రబాబు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జగనన్న పాలనలో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను రూపుదిద్ది చరిత్రలో నిలిచారని గుర్తు చేశారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, సాక్సులతో పాటు అవసరమైనవి జగనన్న ప్రభుత్వం అందించిందని చెప్పారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం సరస్వతి, జెడ్పీటీసీ కరిమున్నీసాబేగం, పీఎంసీ చైర్మన్ చక్రి, జిల్లా శాప్ చైర్మన్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమీళ మృతి కారకులకు శిక్ష తప్పదు

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణ శివారులోని పాండురంగాపురం వద్ద ఉన్న శిల్పా వెంచర్‌లో గత శుక్రవారం బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు సరికాదని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పద్మావతినగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ తమ వెంచర్లలో ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న ఏసేపు కుమార్తె ప్రమీళ (14) మరణానికి కారకులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశానన్నారు. మా కుటుంబ సభ్యులుగా ఉన్న బాలిక మరణం మమ్మల్ని కలచి వేసిందని, ఆమె మృతికి కారకులను కఠినంగా శిక్షపడేలా చేస్తామన్నారు. దీనిపై అఖిలప్రియ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. మృతిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమన్నారు. పూర్తి సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. పసలేని ఆరోపణలతో ప్రజలను మభ్యపెడుతూ రాజకీయంగా లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే వెంచర్‌లోని సీసీ ఫుటేజీలను పోలీసులకు అందించామని చెప్పారు. రీ పోస్టుమార్టం చేసి సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని సూచించడం మంచిదే కానీ.. రాజకీయంగా లబ్ధిపొందేలా చూస్తే సహించేదిలేదన్నారు. ఇష్టమొచ్చినట్లు శిల్పా కుటుంబం పైన నిరాధార ఆరోపణలు చేయడం వీరికి పరిపాటిగా మారిందన్నారు. ఏ ప్రాంతంలో ప్రజా మద్దతుతో గెలిచిన దాఖలాలు లేవు కానీ ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడానికి ముందుంటారని మండిపడ్డారు. సమావేశంలో శిల్పా భువనేశ్వరరెడ్డి, నాయకులు ఉన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు బాసటగా ట్రస్ట్‌బోర్డు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు దేవస్థాన ధర్మకర్తల మండలి బాసటగా ఉంటుందని ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఓ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుదవారం సాక్షితో ఆయన మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానంలో 192 మంది గత 20సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ లేబర్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. 2018వ సంవత్సరం నుంచి ఆ ఉద్యోగులు టైం స్కేల్ ప్రకారం జీతాలు తీసుకుంటున్నారని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ మధ్యకాలంలో ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఇచ్చి వారిని పర్మినెంట్ చేసిందన్నారు. అయితే ఆ జీవో దేవస్థాన ఉద్యోగులకు వర్తించడం లేదన్నారు. దీంతో దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేయాలని రెండు రోజుల క్రితం ఏరవకొండకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఇప్పటికే ట్రస్ట్‌బోర్డులో తీర్మానం కూడా చేశామన్నారు.

శ్రీశైలంలో మహారాష్ట్ర భక్తుల సత్సంగ్

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వాసవీవిహార్‌లో మహారాష్ట్ర ముంబాయ్, పూణేల నుంచి తరలివచ్చిన భక్తులు సత్సంగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిరాటా హరినామసప్తాహ మండల్ భారతదేశ అధ్యక్షుడు గణేష్ జీ మహరాజ్ మాట్లాడుతూ ఈ నెల 26 వరకు సత్సంగ్‌లో అమృత పారాయణాలు, శివలీలపై ప్రవచనాలు ఉంటాయన్నారు. అనంతరం సత్రంలో సదస్సు ఏర్పాటు చేసుకోవడానికి సహకరించిన వాసవీసత్ర సముదాయం అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లును సత్కరించారు.

గిరిజనులందరికీ వంద పనిదినాలు కల్పించండి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని చెంచుగిరిజన గూడేల్లో అర్హులైన వారందరికీ వంద రోజులు ఉపాధి హామీ పథకం పనులు అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం సున్నిపెంటలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులు, ఐటీడీఏ అధికారులతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి పనులతో పాటు చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా అమలవుతున్న అదనపు పనిదినాలను కూడా కేటాయించాలని సూచించారు. సాంకేతిక అంశాలపై శిక్షణ, కొత్తగా సవరణ చేసిన వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ భూహక్కుల చట్టం కింద పట్టాలు పొందని గిరిజనులకు కూడా పనిదినాలను తప్పకుండా కల్పించాలన్నారు. అలాగే ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయ మహాఅభియాన్‌లో భాగంగా పక్కాగృహాలు, రోడ్లు, మెడికల్ యూనిట్లు, హాస్టళ్లు, బోర్లు, విద్యుత్, నీటి సరఫరా అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణం, వందన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు గురించి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో అధికారులు ఎం లక్ష్మీ కుమారి, సి.సూర్యనారాయణరెడ్డి, కొండా నాయక్, గౌరీ శంకర్, మధు, వెంకట కృష్ణ, కేజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్ర

ఆత్మకూరు: క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడమే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఆర్డీఓ దాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇది క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల మధ్య క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఎంపీడీఓ మోహన్‌కుమార్, పీఈటీ దేవానందం శంకర్, సుదర్శన, శ్యామ్, చెన్నమ్మ పాల్గొన్నారు.



కికెట్‌పోటీలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, అధికారులు

ఆలయ అభివృద్ధికి అర్చకుడి చేయూత

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధికి దాతలతో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది సహకరిస్తున్నారని కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మహానంది ఆలయంలో పనిచేస్తున్న అర్చకుడు దొర్నిపాటి సురేంద్ర తన తండ్రి పూర్వపు సీనియర్ అర్చకుడు దొర్నిపాటి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం మహానంది గర్భాలయం చుట్టూ అంతరాలయ మండపంలో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయించారన్నారు. సుమారు రూ. 70 వేలు వెచ్చించి అధునాతనమైన బల్బులను ఏర్పాటు చేయించి తన వంతు సహకారమందించారని చెప్పారు. ఈ మేరకు అర్చకుడు సురేంద్రను ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డితో పాటు వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు, సిబ్బంది అభినందించారు.

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

వెలుగోడు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) డైరీ, నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వేల్పనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ 76 వసంతాల డైరీని ఆవిష్కరించి పలువురికి అందజేశారు. ఉపాధ్యాయులకు ఉపయోగపడే పలు జీఓలు పొందుపరచడం అభినందనీయమని వేల్పనూరు హైస్కూల్ హెచ్‌ఎం రామలింగారెడ్డి అన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు ఆర్‌వీ శ్రీకాంత్‌రెడ్డి, శేషయ్య, బాబా మస్తాన్, సురేష్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమావేశాలకు హాజరుకాకపోతే చర్యలు

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకంలో పనులపై నిర్వహించే సమీక్షా సమావేశాలకు హాజరు కాకుంటే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఏపీఓ రేష్మ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరుకాని కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లపై ఏపీఓ మండిపడ్డారు. సమావేశాలకు రాకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తప్పకుండా పనులు కల్పించాలని, 100 మంది కూలీలకు తగ్గకుండా పనులకు హాజరయ్యేల కృషి చేయాలన్నారు. చ్వేనెలలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని అంతకు ముందుగానే ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామాలలో 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు పనుల గుర్తింపు పూర్తి చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని సంజీవనగర్ తండా వద్ద బుధవారం రాత్రి ద్విచక్రవాహనం – ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో చెంచు నాగన్న అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో నాగన్న కాలు ఒకటి పూర్తిగా తెగి పడిపోయింది. నాగలూటి చెంచు గూడేనికి చెందిన నాగన్న ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. తండావాసులు నాగన్నను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గ్రామాల్లో సెబ్ అధికారుల సోదాలు

మహానంది: గ్రామాల్లో మద్యం, సారా విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ విశ్వనాథరెడ్డి హెచ్చరించారు. మహానంది మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. బొల్లవరం గ్రామంలో ఒకరి వద్ద మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



బాలికల అక్షరాస్యత గురించి వివరిస్తున్న అధ్యాపకురాలు ఆనంద జ్యోతి

శ్రీశైలంప్రాజెక్ట్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని అధ్యాపకులు ఆనందజ్యోతి, ఎస్తేరు రాణి, మౌనిక అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం సున్నిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అధ్యాపకులు మాట్లాడుతూ బాలికలు చదువులో ముందుండాలన్నారు. చదువుతో సమాజంలో బాలికల పట్ల చులకన భావం తొలగిపోతుందన్నారు. ప్రతి రంగంలో పురుషుడితో సమానంతగా మహిళలు రాణించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు వందనాలు

నందికొట్కూరు: ప్రయాణికులను గాలి, వాన, చలి, ఎండ, నిద్రను సైతం లెక్క చేయకుండా సురక్షితంగా గమ్యాన్ని చేర్చే డ్రైవరన్నకు వందనాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం. అన్వర్ హుసేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రైవర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు, ఉద్యోగులు సరోజమ్మ పాల్గొన్నారు.

ప్రతి డ్రైవర్‌ను అభినందిస్తున్నాం

ఆత్మకూరు: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ప్రతి డ్రైవర్‌ను అభినందిస్తున్నామని ఆర్టీసీ ఆత్మకూరు డీఎం మహేంద్రుడు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం డ్రైవర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో డ్రైవర్లు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ అందరి మన్నన పొందుతున్నారన్నారు. విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లను పూలమాలతో సన్మానించారు. అలాగే ప్రమాద రహిత డ్రైవర్లకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎంఎం బాషా, రెండో బహుమతి డి.ఎమ్‌డీ రఫిక్, మూడవ బహుమతి అహ్మద్‌లకు అందించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల హెచ్‌యం హుస్సేన్‌సాహెబ్, అసిస్టెంట్ మేనేజర్ కేవీ నాయక్, మెకానికల్ ఇంజనీర్లు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద రహిత డ్రైవర్లకు నగదు బహుమతి అందజేస్తున్న ఆత్మకూరు ఆర్టీసీ డీఎం మహేంద్రుడు

ఘనంగా ఠాగూర్ శతజయంతి వేడుకలు

ఆత్మకూరు: కార్పూరి ఠాగూర్‌కు భారతరత్న అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఆత్మకూరు నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల శివ అన్నారు. పట్టణంలో కార్పూరి ఠాగూర్ శతజయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు శివన్న, ఎల్లప్ప, గువ్వలకుంట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి స్వాములు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్, మునయ్య మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా.. ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని స్తంభాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. రాజగోపాల్, సుధాకర్, శరత్, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: పట్టణంలోని నీలిషికారీ పేటలో బుధవారం రాత్రి దాడులు నిర్వహించి 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్, ఎస్ఐ హుసేన్‌బాషా తెలిపారు. అలాగే 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారు చేస్తున్న వ్యక్తులు పరారయ్యారన్నారు.

చురుగ్గా కులగణన సర్వే

వెలుగోడు: మండలంలో కుల గణన సర్వే చురుగ్గా సాగుతున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. బుధవారం పట్టణంలో జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఈ నెల 28వ తేదీ వరకు సాగుతుందని, అందుబాటులో లేని ప్రజల వివరాలు నమోదు చేసేందుకు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అవకాశం కల్పించారన్నారు. ఇప్పటి వరకు మండలంలో 53 శాతం కులగణన పూర్తి అయ్యిందని చెప్పారు.

పాములపాడులో ముమ్మరంగా సర్వే

పాములపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే మండలంలో ముమ్మరంగా సాగుతోంది. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణలో సర్వే కొనసాగింది. కృష్ణరావుపేటలో సర్వేను ఎంపీడీఓ గోపీకృష్ణ పరిశీలించారు. ఇప్పటికి దాదాపు మండలంలో 48 శాతం పూర్తయినట్లు వివరించారు.

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేను లక్ష్యం మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని మహానంది ఎంపీడీఓ శివనాగ జ్యోతి సూచించారు. మహానంది మండలంలో బుధవారం అన్ని గ్రామాల్లో సర్వే కార్యక్రమం కొనసాగింది.



దుద్యాల గ్రామంలో చీకటిలోనూ కులగణన చేస్తున్న గ్రామవలంటీర్లు, సచివాలయ సిబ్బంది

చీకటిలోనూ కొనసాగుతున్న కులగణన సర్వే

కొత్తపల్లి: గ్రామాలలో కులగణన సర్వేను సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు వేగవంతం చేశారు. ఉదయమే కాక రాత్రిళ్లు కూడా సర్వే చేపడుతున్నారు. రాత్రి సమయంలో కూడా ఇంటింటికి తిరుగుతూ కులాల, కుటుంబ సభ్యుల, పశువులు, మూగజీవాల, చదువుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

పట్టణాభివృద్ధికి ప్రభుత్వం కృషి

నందికొట్కూరు: పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని 2వ వార్డు కౌన్సిలరు జాకీర్ హుసేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని 2వ వార్డులో కౌన్సిలర్ జాకీర్ హుసేన్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో సీసీ రోడ్లకు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.20 లక్షలు గడప గడప నిధులు మంజూరు చేసిందన్నారు. వార్డులో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రహిమాన్, ముజీబ్, బాబు, రాజు, దావీద్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.



2వ వార్డులో ప్రార్థన చేసి డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలరు జాకీర్ హుసేన్

భవిత కేంద్రానికి సామగ్రి అందజేత



పిల్లలకు కథల పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: స్థానిక భవిత కేంద్రానికి పల్లె ప్రియాంక సేవాసమితి పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మోహన్‌రావు, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రిటైర్డ్ టీచర్ శివరాముడులు సంయుక్తంగా పిల్లలకు అవసరమయ్యే సామగ్రిని అందజేశారు. బుధవారం ఎంఈఓ సుభాన్ చేతుల మీదుగా కథల పుస్తకాలు, కుర్చీలు, ఆట వస్తువులు పంపిణీ చేయించారు. ఎంఈఓ మాట్లాడుతూ భవిత కేంద్రంలోని పిల్లల అభ్యున్నతి కోసం పల్లె ప్రియాంక సేవా సమితి పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు స్పందించి దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు రామకృష్ణయ్య, అరుణకుమారి, సేవా సమితి సభ్యులు వెంకటరావు, వెంకటరమణయ్య, బాలయ్య తదితరులు ఉన్నారు.

ముస్లిం యువకుడికి సత్కారం

శ్రీశైలం: అయోధ్య రామ మందిరంలో ఈ నెల 22న బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సనాతన ధర్మాన్ని ఆచరించిన గాజుల షాపు యజమాని నవమద్‌బాషా, మొబైల్‌షాప్ యజమాని కోళ్ల సురేష్‌ను సిద్ధరామప్ప షాపింగ్ కాంప్లెక్స్ దుకాణదారులు బుధవారం సన్మానించారు. నవమద్ బాషా ముస్లిం అయినప్పటికీ తన షాపు వద్ద శ్రీరామ్ మహోత్సవాన్ని ఏర్పాటు చేసినందుకు, క్షేత్రపవిత్రతను కాపాడుతూ ఆదర్శంగా నిలిచినందుకు సత్కరించినట్లు బీజేపీ మండలం అధ్యక్షుడు మాయలూరి వెంకటేశ్వర్లు తెలిపారు.



నవమద్ బాషా, సురేష్‌బాబులను సత్కరిస్తున్న దుకాణదారులు

ఘాట్ రోడ్డులో జాగ్రత్తగా డ్రైవ్ చేయాలి

మహానంది: నల్లమల ఘాట్‌రోడ్డులో ప్రమాదకర మలుపులు ఉన్నాయని, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి సూచించారు. నంద్యాల–గిద్దలూరు ఘాట్‌రోడ్డులోని ఆంజనేయ పురం చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు పలు వాహనాలను తనిఖీ చేసి వివరాలు సేకరించారు. అనంతరం రోడ్ సేఫ్టీ పోలీసులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పగిడ్యాల: 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమణమ్మ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 23వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి విద్యార్థులకు మార్చి 10న ఉదయం 10 గంటలకు, ఇంటర్‌కు మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

మహానందీశ్వరుడికి ఏకాంతసేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వర స్వామి వారికి బుధవారం ఆలయ పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మహానందీశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపారు. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. రాత్రి స్థానిక యాగశాలలో వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి ఏకాంత సేవ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు.